

కథా నిలయం
శ్రీకాకుళం

# ప్రసాదం

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

రోహిణి కార్తె. రోళ్ళు పగిలేలా చెవుల్లోంచి దూసుకు పోతోంది. వుంది ఎండ. వేడి గాల్పు ఆ ఎండలో, వేడి గాల్పులో-రెండు

గంటల నుండి పోలిగాడు గుడి అరుగు మీద కూర్చున్నాడు. ఎండకు తడారిపోతున్న పెదాలను నాలికతో తడుపుకుంటున్నాడు.

గాలిలో తేమ లేమ-వాడి వంట్లో రక్తం లేదు. వంటికి తగిలే వేడిగాలి కంటే-కడుపులో ఆకలిగాలే ఎక్కువగా వుంది, వాడికి పన్నెండేళ్ళు. ఆకలి, దరిద్రం రెండూ కలిపి రెండేళ్ళు మింగేసినట్లుగా వుంది - పదేళ్ళ వాడిలా బక్క పల్చగా వున్నాడు. వెన్ను కతుక్కున్న పొట్ట మీద పీలికలుగా మిగిలిన చొక్కా, జిడ్డు కారుతున్న కాకీనిక్కరూ వున్నాయి. వాడు క్షణ క్షణానికి గుడి అరుగు మీంచి లేచి రోడ్డుకేసి చూస్తున్నాడు.

'ఆచారిగారింకా రానేదు. ఎప్పు దొస్తారూ? రోజూ ఈ యేళకి దేవుడికి బువ్వెట్టాలి గదా? దేవుడు సద్దివన్నం కూడా తినడు. ఎట్టా గుంటాడూ? పోని కొబ్బరికాయలో, అరటి పళ్ళో పలారం సేసేడను కుందికి-ఈ గుళ్ళో కొచ్చే మడుసులే తక్కువ. ఎట్టాగుంటాడూ? నా కయాతే విన్నటి నుంచి వన్నం నేక శోసొచ్చేత్తాంది' అనుకుంటూ కూచ్చున్నాడు.

పోలిగాడి దృష్టి గోపురం మీద పడింది. గోపురం మీద పిచ్చి మొక్కలు మొలిచాయి. బొమ్మలు వానకు తడిసి-ఎండకు ఎండి-నల్లటి రంగులో కొచ్చేయి. కొన్ని బొమ్మలకు - చేతులు, ముక్కులు ఎగిరిపోయాయి.

గోపురాన్ని చూస్తున్న వాడి దృష్టి ఓ బొమ్మ మీద పడింది. తల తిప్పుకున్నాడు. క్షణం తర్వాత మళ్ళీ అటే చూశాడు. ఆ బొమ్మలో ఆడది నగ్నంగా వుంది. ఆమె పక్కన నగ్నంగా వున్న మగవాడు ఆమె గుండెల మీద చేయివేసి మర్దిస్తున్నట్లున్నాడు.

ఆ బొమ్మల్లో పొలిగాడి కేదో అశ్లీలం తోచింది. టక్కున కళ్ళు మూసుకున్నాడు. ఎదుగుతున్న మనసు, చుట్టూ ఉన్న ప్రతి విషయం మీద ఓ అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం. ఆ ప్రయత్నంలో అనుక్షణం లక్ష ఆలోచనలు-కోటి సందేహాలు.

'గుళ్ళో ఇలాంటి బొమ్మ లెందుకు సెప్మా? ఇలాంటి బొమ్మలు గోపురం మీద పెడితే దేవుడూరు కుంటాడా? మరి నాన్న-గుండెలు కనపడుతున్న ఆడబొమ్మ కాలెం డరు ఇంట్లో తడికకు తగిలిస్తే అమ్మ దెబ్బలాడింది. చిన్న పిల్ల లున్న ఇంట్లో ఉంచకూడదని

పీ కేసింది. ఇక్కడుండచ్చా? గుళ్ళో అయితే సూడచ్చా, సూడకూడదా? అమ్మ నడగాలి.

'అవునూ! అమ్మ-ఏం చేస్తూ వుంటుంది. అవు నేంచేస్తుంది? నాన్న జబ్బు మంచం దగ్గర కూర్చుని చిట్టి చెల్లి వళ్ళో కెక్కుతూంటే, 'అబ్బా! పాలు లేవంటే వినవు-నా రక్తం పీల్చేయి' అంటూ ఉంటుంది. రోజూ అనే మాటేగా! తమ్ముడు కూడా ఆకలని ఏడుస్తున్నాడేమో! ఆచారిగారింకా రావేదు. రెండు నెల్ల క్రితం నాన్న కాలు మిషనులో ఇరుక్కున్నప్పుడు ఇంత ఆకలి నేదు. ఇప్పుడయితే పేగులు పిండేస్తోంది. ఆచారిగారిచ్చే


## శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సుస్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడీ గుడివద్ద, ఫోన్: 551, తెనాలి (ఎ.పి.)

బ్రాంచి: 26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17

**దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము**



హస్త ప్రయోగంవల్ల, అతి సంభోగము వలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక్క డోస్‌తో ఎన్నడూ, కని విని ఎరుగనంత వీర్యస్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తిచెందు స్త్రీ, పురుషులు వాడదగినది-స్వస్థులు.) హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా వైద్యం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బస వ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు :- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరువబడును.

ప్రసాదం తమ్ముడికి పట్టుకెళ్ళాలి. అప్పుడెప్పుడో దేవుడి ప్రసాదం ఎట్టేరు. ఎంత బాగుంది! ఆచారిగారు వచ్చేసేరా ఏంటి?'

పోలిగాడు లేచి గుళ్ళోకి నడిచేడు. గోపురం లోపలి అరుగుల మీద ఇద్దరు సాధువులు, కుంటి బిచ్చగాడు కూర్చున్నారు. సాధువులు చుట్టలు కాలుస్తున్నారు. కుంటి బిచ్చగాడు బీడి కాలుస్తున్నాడు. వాళ్ళ ముగ్గురి దృష్టి ముందున్న పొడుగాటి మడతల కాగితం మీద-పక్కనే వున్న న్యూస్ పేపర్ లోంచి కట్ చేసిన బొమ్మ మీద వుంది. శ్రద్ధగా చూస్తున్నారు.

"బొమ్మలో మూడు వేళ్ళు చూపిస్తున్నాడు. మూడు ఓపనింగ్ పలకాలి." అన్నాడొకడు.

"మొన్నటిదానికి ఆపోజిట్ అయినా మూడు రావాల్సిందే!" మరొకడు.

"ఇదేం కాదు! కట్ బ్రాకెట్టు రావచ్చు" అంటూ ఒకడు నోట్లో చుట్టతీసి గోడమీద వుమ్మేడు.

పోలిగాడు ఉలిక్కిపడి "గుళ్ళో ఉమ్ముతావేంది? కళ్ళుపోతాయి" అన్నాడు.

"పోరాకుర్రనాగన్నా!" కళ్ళెర్ర చేశాడా సాధువు.

పోలిగాడికి భయం వేసింది. 'అమ్మో! బాలనాగమ్మ సినిమాలో లాగ—ఈ సాధువు నన్ను కుక్క-పిల్లని చేస్తే? అలా చేయగలడా? ఏమో' అనుకుంటూ ధ్వజస్తంభం దగ్గరకొచ్చేడు.

అక్కడ నలుగురు పేకాడుకుంటున్నారు. వాళ్ళు దేవుడి విగ్రహం ముందున్న కటకటాలకు అడ్డంగా కూర్చుని ఆడుకుంటున్నారు. పోలిగాడు-వాళ్ళని, వాళ్ళ వెనకాలవున్న దేవుణ్ణి చూశాడు. వాడి కేదో గుర్తొచ్చింది. 'అవునూ. ఆ సినిమాలోనే! సరిగ్గా ఇలాగే రాజకుమారుడ్ని ఖైదు చేసి, రాజభటులు పులి-మేకా ఆడుకుంటూ కూర్చున్నారు. రాజకుమారుడు తప్పించుకునిభటుల్ని చితకదన్నేడు. మరి దేవుడుకూడా....వీళ్ళని?....'

వంగి దేవుణ్ణి చూశాడు. పోలిగాడికి దేవుడు విచారంగా ఆకలిగా కనబడ్డాడు. 'నిజంగా వీళ్ళుదేవుణ్ణి ఖైదు చేసి పేకాడుకుంటున్నారా? దేవు డెందుకలా వున్నాడు? అం-దేవుణ్ణి ఈళ్ళు ఖైదు సేయగలరా? తల్చుకుంటే ఆయనే ఈళ్ళని ఖైదు సేత్తాడు.

'పేకాట మంచి పనికాదు-వద్దు అంటుందమ్మ. నాన్న నవ్వేసి వెళ్ళి పోతూ వుంటాడు. అది తప్పు పనే కదా! మరి దేవు డెందు

కూరుకుంటున్నట్లూ? తన గుళ్ళో ఆడుకుంటే ఆయనేం చేస్తున్నట్లూ? కదలనేడా? ఆకలా? ఆకలివల్ల నాలాగే కదలలేక పోతున్నాడా?'

ఆకలి గురించి ఆలోచించేసరికి వాడికి కడుపులో పేగులు కరిచేయి. తిరుగుతున్నట్టు అనిపించింది. దూరంగా వున్న గరుడవాహనం దగ్గర చతికిలపడ్డాడు.

'అసలీ ప్రసాదం విషయం విన్నెందుకు గుర్తు రాలేదూ? విన్నంతా ఆకలితో పడున్నాను. విన్న కూడా రావాల్సింది!'

వాడి ఆలోచనలుచెదరగొడుతూ వాహనం వెనకనుంచి గుసగుసలు.

"వేళా-పాళా లేదు. ఎప్పుడు పడితే అప్పుడే! ఇక్కడొద్దు-చేయి తీయి..." సన్నగా అంటోంది ఆడకంఠం.

"నీ గుడిసెకాడ కొచ్చే ఓపిక లేదు. అయిదు నిమిషాలు-అంతే! నీ రూపాయి నువ్వు అట్టుకెళ్ళు..." మగ కంఠం.

"అబ్బా! ఇక్కడొద్దు-తప్పు!"

పోలిగాడు ఉలిక్కిపడ్డాడు. 'ఎక్కడనుంచా మాటలు! మనుషులు కనబడరే? దెయ్యాలా? ఊహూ! దెయ్యాలు మనుషుల్లా మాట్లాడతాయా? దేవుడు గుళ్ళోకి రానిస్తాడా? చంపేయడూ? మరి ఎవరూ?'

"త్వరగా కానియ్!" వాహనం వెనకనుంచి వినపడింది.

పోలిగాడులేచి వాహనం వెనక్కి నడిచేడు. గరుడవాహనం రెక్కల వెనుక ఓ ఆడ మనిషి, గుర్రం బండి కామరాజు ఆయాసపడి పోతున్నారు.

పోలిగాడిని చూడగానే ఉలిక్కిపడి కామరాజు, "నీకిక్కడేం పని? ఎళ్ళి ఆడుకో!" అరిచేడు కోపంగా.

పోలిగాడికి వాళ్ళేం చేస్తున్నారో అర్థంకాకున్నా, గుళ్ళో చేయకూడని పనేదో చేస్తున్నారని పించింది. గుడి బయటకొచ్చి అరుగుమీద కూర్చున్నాడు.

'అబద్ధం ఆడితే కళ్ళు మూపేత్తాడుదేవుడు అంటుందమ్మ. మరి-గుళ్ళో వెధవ పన్లు సేస్తుంటే దేవుడెందుకూరుకుంటున్నాడు? తన బిడ్డలాంటోళ్ళనా? మరి అమ్మకు నేనూ బిడ్డనేగదా? నేను ఏదైనా చేస్తే అమ్మ నన్నెందుకు కొడుతుందీ?

'దేవుడు-ప్రసాదం తిని ఈళ్ళకి బుద్ధి సెప్తాడేమో! ఆచారిగారింకా రానేదు. ఊరినుంచి రావాలి కదా! వత్తారు' అనుకుంటూ పోలిగాడు

ఊరిని, గుడిని కలుపుతున్న రోడ్డు కేసి చూస్తూనే నిద్రలోకి జారి పోయాడు.

* * *

ఆచారిగారు కొట్టిన గంటకు ఆ వేణుగోపాలుడు నిద్ర లేచేడో లేదో గాని, పోలిగాడు టక్కున లేచేడు.

'అరే! నేవేజ్జం అయిపోతోందే' అనుకుంటూ గుళ్ళోకి నడిచాడు గబగబా.

పేకాడుతున్న వాళ్ళు కొంచెం పక్కకు తప్పుకుని పేకాడుకుంటున్నారు. 'నెవేజ్జం అవుతోంది గదా! పేకాట మానేయకూడదు.' ఖైదీకి వన్నం అట్టుకెళ్ళడానికి అనుమతించిన రాజభటులు గుర్తొచ్చారు. 'యదవలు' తిట్టుకున్నాడు తనలోనే పోలిగాడు.

లోపల దేవుడి గదిలో వున్నారు ఆచారిగారు. ఆ గదికి తెర అడ్డుగా వుంది. 'గంట కొట్టి దేవుణ్ణి లేపి ప్రసాదం తినిపిత్తారు కాబోలు' అనుకుంటూ చేతులు జోడించేడు పోలిగాడు.

కాస్సేపటికి తెర తప్పుకుంది. ఆచారిగారు బయటకొచ్చేరు. ఆయనతో ప్రసాదం గిన్నె బయటకొచ్చింది. పోలిగాడు పక్కకు తప్పుకున్నాడు. ఆచారిగారు మంత్రాలు చదువుతూ మూడు ప్రసాదం ముద్దలు ధ్వజస్తంభం దగ్గరున్న బలిపీఠం దగ్గరగా ఉంచారు.

ఆ తర్వాత గుడికి తాళంవేసి తిరుగు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నారు ఆచార్లుగారు.

ఆ క్షణం కోసం చాలాసేపటి నుంచి కాచుకున్న పోలిగాడు "బాబుగోరూ! ప్రసాదం!" అని అడిగేడు.

ఆచారిగారు విననట్లుగా-తాళాలు బొడ్లో దోపుకుని నడక సాగించేరు. పోలిగాడు అనుసరించాడు.

"ఆచార్లుగారూ! పెద్ద తలుపు తీసి ఉండటంవల్ల, గుళ్ళో దూరి యదవ పన్లు సేస్తున్నారండి" అన్నాడు పోలిగాడు.

ఆచార్లుగారు ఆగి వెనక్కి చూసి "చేయనీ" అన్నారు.

"దేవుడు కళ్ళు మూసేస్తాడు" అన్నాడు పోలిగాడు.

ఆయన నిట్టూర్చి, "ఆయనే కాసుకోవాలి. నావల్ల కాదు. తాళం వేస్తే బద్దలు కొట్టేస్తున్నారు. ఏదయినా అంటే నామీద తిరగబడుతున్నారు. ఆదాయంలేని గుడి కనుక ఆలనా-పాలనా చూసే నాధుడు లేదు. ఆదాయం వుంటే

అంతా ఎగబడతారు" అన్నారు ముందుకు నడుస్తూ.

పోలిగాడు ఆయనను అనుస రిస్తూనే వున్నాడు. వాడెందుకొస్తు న్నాడో ఆచార్లుగారు గ్రహించేరు. 'వీడు ప్రసాదం కోసం వస్తున్నాడు. పసివాడవి ముఖం. ఎండలో నా రాక కోసం ఎప్పటి నుండి కాచు కున్నాడో' అనుకుంటూ నడుస్తున్నా రాయన.

పోలిగాడు గొంతు సవరించుకుని, "బాబూ! మా నాన్నకి వంట్లో కుదుర్నేక పని కెల్లటం లేదు. మొన్నరాత్రి నుంచి వన్నం నేదు. కళ్ళు తిరుగుతున్నాయి. ప్రసాదం ఎట్టించండి బాబూ!" దీనంగా అడిగేడు.

ఆచార్లుగారు ఆగి వెనక్కి చూశారు.

"మీరొస్తారని కానాసేపట్నించి

## రచయితలకు మనవి

'విజయ' లో ప్రచురణార్థం పంపే కథలు, నవలలు, కార్టూన్స్, జోక్స్, వ్యాసాలు-ఏవైనా సరే ప్రచురణార్హం కాని వాటిని త్రిప్పి పంపగోరువారు, తగినంత పోస్టేజీ అంటించిన కవర్లను జత చేయవలసిందిగా కోరుతున్నాం. అప్పుడే విరాకరించిన వాటిని త్రిప్పి పంపటం జరుగు తుంది. ఆ తర్వాత ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపే ప్రయోజన ముండదు. 'బాపు అభిమానుల పేజీ' లో పాల్గొనే పాఠ కులు, తమ సంభాషణలను కార్డుమీద వ్రాసి పంపితే చాలు.

—ఎడిటర్

రచనలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్, 'విజయ'

80-ధనలక్ష్మి కాలనీ, మద్రాసు-600 026.

కాసుకున్నాను." జాలిగా అన్నాడు పోలిగాడు ఆచార్లుగారి మొహం వైపు చూస్తూ.

ఆచార్లుగారు చలించేరు. క్షణం ఆలోచించి నిట్టూర్చేరు. "నువ్వే కాదురా! ఈ ప్రసాదం కోసం గుళ్ళో దేవుడే ఇప్పటి వరకు కాసుకున్నాడు. నిన్నటి నుంచి భోజనం లేని నా కుటుంబం అంతా ఇంకా కాచుకునే వుంది. 'అసలీ వేళ దేవుడికి ఆరగింపు చేయగలనా?' అని ఆరాటపడ్డాను. ఆ వేణుగోపాలుడే ఓ భక్తుడి ద్వారా ఓ సోలెడు బియ్యం తెచ్చుకున్నాడు. దీనితో నాకు—నా దేవుడికి ఈ రోజుకు తిండి-వెళ్ళు" అన్నారాయన బాధగా. ఆ మాట అంటున్నప్పుడు అరవై ఏళ్ళ ఆచారిగారి కంఠం ఏదో చెప్పలేని బాధతో వణికింది.

పోలిగాడు నిలబడి పోయాడు ఆశ్చర్యంగా వింటూ.

ఆచార్లుగారు-"నువ్వు నన్నెంత తిట్టుకుంటున్నావో నాకు తెల్సు. కానీ-నేను ఆశక్తుడ్ని. నువ్వయితే మరో చోటి కెళ్ళయినా-నీ కడుపు మంట చల్లార్చుకోగలవు. యాచించడంకూడా రాని నేనేం చేసేది?" అన్నారాయన కంఠంలో ఆవేదన ధ్వనిస్తుండగా.

పోలిగాడు నిరాశగా తల దించుకున్నాడు ఏం మాట్లాడకుండా.

ఆచారిగారు క్షణం ఆలోచించి, "చూడూ! దేవుడి ధ్వజ స్తంభం దగ్గర మూడు ముద్దలు ప్రసాదం పెట్టాను. వెళ్ళి తీసుకో" అన్నారాయన.

ఆచారిగారు ఊరికేసి నడుస్తూ, 'అరే! రోజుకంటే ధ్వజ స్తంభం దగ్గర కూడా ప్రసాదం ఈ రోజు తక్కువే వుంచేను. భగవాన్! ధ్వజ స్తంభం దగ్గర తీసుకోమని చెప్పటంవల్ల నాకు కలిగే పాపం ఏదైనా వుంటే-ఆ పాపం ఆకలిది. దాన్ని పుట్టించిన నీది' అనుకున్నారాయన.

పోలిగాడు మళ్ళా గుడికేసి వస్తూ, 'ఆచారిగారి కుటుంబమంతా ఈ ప్రసాదం కోసం కాసుకున్నారు గదా? ఒకవేళ నైవేద్యం ఎట్టినపుడు ఆకలేసి దేవుడు ప్రసాదం అంతా తినేస్తే? ఆచారిగారు ఏంసేస్తారూ? అలా రోజూ తినేత్తే అసలింక నైవేద్యమే సేయరేమో!' తనలో తానే ఏదేదో ఆలోచించుకుంటూ వస్తున్నాడు.

అప్పటికే ఆ గుళ్ళో వున్న కుక్కల్లో ఓ కుక్క, మూతి నాలికతో తుడుచుకుంటూ పోలిగాడి కెదురొచ్చింది. *